ప్రజాశక్తి
సోమవారం 4 ఆగస్టు 2025
8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

స్మార్ట్ భారాలు



తగరపువలసలోని ఓ ఫ్యాన్సీ దుకాణానికి బిగించిన స్మార్ట్ మీటర్

- రెట్టింపు బిల్లులతో వినియోగదారులు బెంబేలు
- కూటమి తీరుపై మండిపాటు

ప్రజాశక్తి - భీమునిపట్నం

అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. తాజాగా వచ్చిన బిల్లులను చూసి వినియోగదారులు అవాక్కవుతున్నారు. ఏ సమస్యాలేని పాత మీటర్లను తొలగించి, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి తమపై భారాలు మోపడంపై విశాఖ జిల్లా తగరపువలస వాసులు భగ్గుమంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి అని చెప్పినవారే నేడు శరవేగంగా వాటిని బిగిస్తున్నారని పేర్కొంటూ కూటమి సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్మార్ట్ వి ద్యుత్ మీటర్లు ఏర్పాటు పట్ల అపోహలు వద్దని, వినియోగదారులపై ఎటువంటి అదనపు ఛార్జీల భారం పడదని చెబుతూ భీమునిపట్నం మండలంలో స్మార్ట్ మీటర్లను బిగించారు. అవిప్పుడు గిర్రున తిరుగుతున్నాయి. అదానీ స్మార్ట్ విద్యుత్ మీటర్లు పెట్టాలని మేం ఏమైనా అడిగామా ? అటువంటప్పుడు ఈ మీటర్లపై ఎందుకు అంత అత్యుత్సాహమని మిగతా 2లో..

రెట్టింపు బిల్లు వచ్చింది



మా దుకాణానికి ఆరు నెలల క్రితం పాత విద్యుత్ మీటరును తీసేసి, అదానీ స్మార్ట్ విద్యుత్ మీటరు బిగించారు. పాత విద్యుత్ మీటరు ఉండేటప్పుడు రీడింగ్ తీసి బిల్లు చేతికి ఇచ్చేవారు. ఇప్పుడేమో మొబైల్ ఫోన్‌కు మెసేజ్ వస్తోంది. మొబైల్ ఫోన్ ద్వారానే బిల్లు చెల్లిస్తున్నాం. ఆరు నెలల క్రితం పాత విద్యుత్ మీటరు ఉండేటప్పుడు నెలకు సుమారు రూ.600 నుంచి రూ.700 మధ్య బిల్లు వచ్చేది. ఇప్పుడు ఆ బిల్లు మొత్తం రెట్టింపు అయింది. మేలో రూ.2137, జూన్‌లో రూ.1260, జూలైలో రూ.1270 బిల్లు వచ్చింది.

సిహెచ్.దేవుళ్లు
ఫ్యాన్సీ దుకాణ నిర్వాహకుడు, తగరపువలస

ఈ భారం మోయలేం



మాది చిన్న పాటి కిరాణా దుకాణం. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, ఆ తర్వాత మధ్యాహ్నం 4 నుంచి రాత్రి 8.30 గంటల వరకు తెరిచి ఉంటుంది. మంగళవారం సెలవు. స్మార్ట్ విద్యుత్ మీటరు బిగించక ముందు నెలకు సుమారు రూ.450 బిల్లు వచ్చేది. బిగించాక నెలకు సుమారు రూ.700 పైబడి బిల్లు వస్తోంది. వర్షాకాలంలోనే ఇంతగా బిల్లు వస్తుంటే వచ్చే వేసవిలో బిల్లు ఏ స్థాయిలో వస్తుందో ఊహించుకుంటేనే భయమేస్తోంది.

యు.సూర్యారావు,
కిరాణా దుకాణం యజమాని, తగరపువలస

ఎకో టూరిజానికి ప్రాధాన్యం

- వైజాగ్ సర్కిల్ ఏడు జిల్లాల పరిధిలో నగర వనాల అభివృద్ధి
- పర్యావరణ పర్యాటక ప్రాజెక్టులపై దృష్టి
- తాటిపూడిలో బోటింగ్ పున:ప్రారంభిస్తాం
- జీవ వైవిధ్యం పెంచేందుకు కృషి
- 'ప్రజాశక్తి'తో అటవీ సంరక్షణాధికారి దివాన్ మైథీన్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో





సహజ వాతావరణాన్ని పరిరక్షించడానికి చర్యలు చేపడుతున్నట్టు విశాఖ సర్కిల్ అటవీ సంరక్షణాధికారి బిఎం.దివాన్ మైథీన్ తెలిపారు. మానవ జాతి మనుగడకు అవసరమైన భూమి, గాలి, నీరు, ఆహారం, వెలుతురు, వేడి, చలి లభ్యతలను పెంచేందుకు కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల్లోగల ఇతర జీవరాసులను పరిరక్షించడం ద్వారా జీవ వైవిధ్యం (బయో డైవర్శిటీ) దిశగా అటవీ శాఖ ద్వారా ప్రయత్నిస్తున్నామన్నారు. ఇలా పర్యావరణ పర్యాటకం (ఎకో-టూరిజం) చేయడం ద్వారా 50 శాతం పచ్చదనాన్ని పెంచనున్నామన్నారు. ఈ క్రమంలోనే ప్రజలకు మొక్కలు పంపిణీ చేస్తూ, ప్రకృతిని రక్షిస్తూ టూరిజం అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. గతంలో పలు కారణాల రీత్యా నిలిచిపోయిన విజయనగరం జిల్లా తాటిపూడి రిజర్వాయర్‌లో బోటింగ్‌ను త్వరలోనే పున: ప్రారంభించ బోతున్నామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎకో టూరిజం ప్రాజెక్టులకు పెద్దపీట వేయబోతున్నామని వెల్లడించారు. 'ప్రజాశక్తి'కి ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఎంత విస్తీర్ణంలో ఎకో టూరిజం గ్రీన్ కవర్ చర్యలు తీసుకుంటున్నారు ?

రాష్ట్ర అటవీ శాఖ పరిధిలో 23 శాతం అడవులు ఏడు జిల్లాల పరిధి అయిన విశాఖపట్నం సర్కిల్‌లో ఉన్నాయి. మొత్తంగా 6574 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో శ్రీకాకుళం జిల్లా మొదలుకొని చింతపల్లి వరకూ అటవీ ఏరియా ఉంది. ఈ ప్రాంతాల్లో జనాలకు మొక్కలు ఇవ్వడం ద్వారా 50 శాతం గ్రీన్ కవర్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

నగర వనం కింద ఎక్కడెక్కడ మిగతా 2లో..

విద్యారంగ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కండి

వార్త 8లో..

మండుతున్న ఎండలు.. ఎండుతున్న వరి

వార్త 8లో..

శివారు గ్రామాలకు రేషన్ కష్టాలు

వార్త 6లో..



తీరంలో స్నేహితుల సందడి

ఆదివారం విశాఖ సముద్ర తీరానికి యువత పోటెత్తారు. స్నేహితుల దినోత్సవాన్ని ఉత్సాహభరితంగా ఇసుక తిన్నెల్లో జరుపుకున్నారు. ఫ్రెండ్ షిప్ బ్యాండ్లు కట్టుకున్నారు. ఆత్మీయ ఆలింగనాలు, పాత ముచ్చట్లతో ఆర్‌కె బీచ్ రోజంతా సందడిగా కనిపించింది.

ఆదర్శనీయుడు.. వెంకట రమణారెడ్డి

సంస్మరణ సభలో వక్తలు



వెంకట రమణారెడ్డి సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - సీతమ్మధార : గ్రంథాలయ ఉద్యమకారుడు, పుస్తక ప్రియుడు, కార్టూనిస్టు ముల్లంగి వెంకట రమణారెడ్డి అందరికీ ఆదర్శనీయుడని పలువురు వక్తలు కొనియాడారు. వెంకట రమణారెడ్డి సంస్మరణ సభ విశాఖ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ సమాజానికి ఎంతో కొంత మేలు చేయాలని ఆలోచించిన వ్యక్తి ముల్లంగి వెంకట రమణారెడ్డి అని అన్నారు. భావితరాలు సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలని ఆకాంక్షించారన్నారు. ఆ తీరుగా ఆయన పిల్లలను పెంచారన్నారు. తన జీవితం ప్రజలకు మేలు చేసే విధంగా ఉండాలని భావించి అహర్నిశలూ అలానే పనిచేశారన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ వెంకట రమణారెడ్డి ఎన్నో పుస్తకాలను గ్రంథాలయాలకు దానం చేశారని తెలిపారు. పుస్తకాలన్నా, కథకులన్నా, రచయితలన్నా ఆయనకు అపారమైన ప్రేమ అని తెలిపారు. ఆయన చూపిన మార్గంలోనే ఆయన పిల్లలు నడిచి సమాజానికి ఉపయోగపడే విధంగా పలు ఉద్యమాల్లో స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. ప్రముఖ రచయిత డాక్టర్ బివి.సూర్యారావు మాట్లాడుతూ రమణారెడ్డి రచనలు ఎంతో గొప్పవని కొనియాడారు. నేటి సమాజానికి, పిల్లలకు అవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రస్తుత గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు ఆయన కథలు చదివి ఇంటికి పిలిపించుకొని మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

స్మార్ట్ భారాలు

వినియోగదారులు ఎక్కడికక్కడ ప్రశ్నిస్తున్నారు. సిపిఎం, ప్రజా సంఘాలు చేస్తున్న పోరాటంలో వారు భాగస్వాములవుతున్నారు. తగరపువలసలో స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటుతో కిరాణా, ఫ్యాన్సీ, ఔషధ దుకాణాలు, జ్యూస్ సెంటర్ల నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. కమర్షియల్ కేటగిరీ కింద స్మార్ట్ విద్యుత్ మీటర్లను బిగించిన ఫలితంగా రెట్టింపు స్థాయిలో బిల్లులు వస్తున్నాయని చెబుతున్నారు.

అమాంతంగా బిల్లు పెరిగింది

మాది చిన్నపాటి ఔషధ దుకాణం. సుమారు మూడు నెలల క్రితం స్మార్ట్ విద్యుత్ మీటరు బిగించారు. అప్పటి నుంచి బిల్లు రూ.2 వేలు వస్తోంది. పాత మీటర్ ఉండేటప్పుడు రూ.1200 వచ్చేది.

రాజు,
ఔషధ దుకాణం యజమాని, తగరపువలస

గుండె గుభేలుమంటోంది

కరెంట్ బిల్లు మెసేజ్ చూస్తేనే గుండె గుభేలుమంటోంది. వర్షాకాలంలో పండ్ల రసాల దుకాణం వ్యాపారం సాదా సీదాగా ఉంటుంది. మూడు నెలల క్రితం స్మార్ట్ విద్యుత్ మీటరు వేశారు. అప్పటి నుంచి నెలకు రూ.3500 వస్తోంది.
పాత మీటర్ ఉండేటప్పుడు నెలకు రూ.2,200 వచ్చేది.

జికె.ఫ్రూట్ జ్యూస్ దుకాణం యజమాని,
తగరపువలస

ఎకో టూరిజానికి ప్రాధాన్యం

అభివృద్ధి చేస్తున్నారు ?

నగరం, పట్టణాలకు 10 కిలోమీటర్ల దూరంలో ఉండే అటవీ ప్రాంతాలను ఎంపిక చేశాం. ఈ విధంగా నగర వనం కింద కంబాల కొండ, విజయనగరం జిల్లాలో సారిపల్లి, నెల్లిమర్ల, బేతనాపల్లి, శ్రీకాకుళం జిల్లాలో కాశీబుగ్గ, అనకాపల్లి జిల్లాలో బయ్యవరం, యలమంచిలి, నర్సీపట్నం, మన్యం జిల్లాలో పార్వతీపురం ప్రాంతాల్లో నగరవనం కింద అభివృద్ధి పనులు చేపట్టాం.

ఎకో టూరిజం కింద ఏయే ప్రాజెక్టులు చేపట్టారు ?

ఎకో టూరిజం కింద అరకులో కొండలపై ప్లాంటేషన్ చేపట్టాం. అనంతగిరి, మరదగూడ వంటి చోట్ల సిఎస్ఆర్ నిధులు సింహాద్రి ఎన్‌టిపిసి ద్వారా రూ.5 కోట్లు వచ్చాయి. ఎకో టూరిజం అభివృద్ధికి పనులు చేపట్టాం. లంబసింగిలోని కృష్ణాపురం వద్ద, పాడేరులోని వంజంగి వద్ద ఎకో టూరిజం ప్రాజెక్టులు చేపడుతున్నాం. విజయనగరం జిల్లా గంట్యాడ మండలంలోని తాటిపూడి రిజర్వాయర్‌లో బోటింగ్ సౌకర్యాలకు తిరిగి చర్యలు తీసుకుంటున్నాం.

వైజాగ్ సర్కిల్‌కు ప్రభుత్వం నుంచి నిధులెలా వస్తాయి?

ఏటా రూ.50 కోట్లు వరకూ విశాఖపట్నం అటవీ రేంజ్ ప్రాంతాల అభివృద్ధికి నిధులు వస్తాయి. కాంబా అనే పథకం నడుస్తోంది. ఏనుగులకు సంబంధించి పరిరక్షణ, ఏనుగులు జనావాసాల్లోకి వస్తే తీసుకోవాల్సిన చర్యల వంటివి ఈ పథకంలోకి వస్తాయి. అలాగే ఫారెస్ట్ ఫైర్ (అడవులు కాలిపోవడం) వంటి సందర్భాల్లో చేపట్టే చర్యలకు, నగర వనం కోసం నిధులను ఖర్చుచేస్తాం.

అటవీ జంతు సంపద ఎలా ఉంది ?

వైజాగ్ సర్కిల్ పరిధిలో అటవీ జంతు సంపద పుష్కలంగా ఉంది. బఫుల్లా (అడవి దున్న)లు ఉన్నాయి. చిరుత ఉంది. జింకలు విస్తారంగా ఉన్నాయి. ఎలుగు బంట్లు, అడవి కుక్కలు (వైజ్ డాగ్స్) కూడా ఉన్నాయి. ఒడిశా నుంచి పెద్ద పులి ఒకటి నిత్యం తిరుగుతూ ఉంటుంది. అది పొలాల్లోకి రావడాన్ని ఒడిశాకు దిగువన గల శ్రీకాకుళం అటవీ ప్రాంత గ్రామాల్లో జనం చూస్తున్నట్లు చెబుతున్నారు. పెద్ద పులిని దూరం నుంచి చూసిన వాళ్లు వెనక్కి వెళ్లిపోతుంటారు. కొన్ని సందర్భాల్లో పులి పాదాలను చూసి మాకు తెలియజేస్తున్నారు.

ఆదర్శనీయుడు.. వెంకట రమణారెడ్డి

ఘనంగా సత్కరించిన విషయాన్ని గుర్తుచేశారు. సిపిఎం సీనియర్ నాయకులు పద్మనాభరాజు మాట్లాడుతూ రమణారెడ్డి చిరస్మరణీయుడని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో కుటుంబ సభ్యులు ఉద్యమాల్లో ముందుకెళ్లడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సుజాత, సుగుణ, సునీత, ఫణిబాబు, కమలాకర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు. తొలుత వెంకట రమణారెడ్డి చిత్రపటం వద్ద ఘనంగా నివాళ్లర్పించారు.

ఇళ్లపై కూలిన చెట్టు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ ఒపి గేటు పక్కన ఉన్న వార్డు బాయ్‌లైన్‌లో ఆదివారం ఒక చెట్టు కూలిపోయి రెండు ఇళ్లపై పడింది. ఆ రెండు ఇళ్ల రేకుల షెడ్లు కావడంతో రేకులు విరిగి లోపల పడ్డాయి. ఆ సమయంలో ఇళ్లలో ఎవరూ లేనందున ప్రమాదం తప్పింది. ఆకుల మహేష్, ఆకుల అశోక్‌కు చెందిన ఇళ్లపై చెట్టు పడింది. దీంతో ఇంటిలో సామగ్రికి నష్టం వాటిల్లింది. ప్రమాదం గురించి జివిఎంసి, సచివాలయం సిబ్బందికి బాధితులు సమాచారం అందించారు.

కానీ ఆదివారం సెలవు అని సిబ్బంది చెప్పడంతో బాధితులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేకులు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని, నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: స్టీల్‌ప్లాంట్‌లో నోటీసులు ఇవ్వకుండా,చట్ట విరుద్ధంగా తొలగించిన 5వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటి కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షా శిబిరంలో పబ్లిక్ సెక్టార్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, గాజువాక ఎమ్మెల్యే, విశాఖపట్నం ఎంపీలు జోక్యం చేసుకోవాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ భూ నిర్వాసితులు అందరికీ ఉపాధి కల్పించాలన్నారు. పాత వారి స్థానంలో చేపడుతున్న కొత్త నియామకాలను రద్దు చేయాలన్నారు. బయోమెట్రిక్‌తో ఆధార్ లింక్ ఎత్తివేయాలన్నారు. కార్యక్రమంలో బిహెచ్ఈఎల్ సిఐటియు యూనియన్ ప్రధాన కార్యదర్శి జిటిపి ప్రకాష్, హెచ్ఎస్ఎల్ సిఐటియు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

మలబార్‌లో జ్యూయలరీ షో ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ప్రముఖ ఆభరణాల సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ విశాఖ స్టోర్‌లో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యూయలరీ షోను పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ స్టోర్ హెడ్‌జరీన్ మాట్లాడుతూ "ఆర్టిస్ట్రీ షో' బ్రాండెడ్ జ్యువలరీ ఒక విశిష్ట ఆభరణాల ప్రదర్శన అన్నారు. ఈ ప్రదర్శనలో భాగంగా బంగారం, వజ్రాభరణాలు, జాతి రత్నాభరణాలను ప్రదర్శిస్తున్నామన్నారు. ఆర్టిస్ట్రీ షోలో ప్రత్యేక ఆకర్షణలుగా మలబార్ గోల్డ్ డైమండ్స్ వారి బ్రాండుల సమాహారం "మైన్" ధ్రువీకరించిన వజ్రాభరణాలు, వివాహం పార్టీ సంబరాల కోసం, 'ఎరా' అన్కట్ వజ్రాలతో పొదిగిన విశిష్ట శ్రేణి, 'ప్రెష్యా' జాతిరత్నాభరణాల సముదాయం, 'ఎత్నిక్స్' హస్తకళా నైపుణ్యతతో తయారైన ఆభరణాలు, "జోల్" అధునాతన డిజైన్లతో తేలికపాటి ఆభరణాలు, 'డివైన్' భారతీయ ప్రాచీన సంప్రదాయం వ్యక్తం చేసే ఆభరణాలు, ఇంకా చిన్నారుల కోసం 'స్టార్లెట్' పిల్లల ఆభరణాలు అందుబాటులో ఉంచామన్నారు. ఈ ప్రదర్శన ఆగష్టు పదో తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ప్రతి కొనుగోలుపై ప్రత్యేక ఆఫర్లు ఉన్నాయని, బంగారు ఆభరణాల, రత్నాభరణాల తరుగు చార్జీలపై ఫ్లాట్ 30 శాతం తగ్గింపు, వజ్రాభరణాల వజ్రాల విలువపై 30 శాతం వరకు తగ్గింపు పొందవచ్చని చెప్పారు.



జ్యూయలరీ షోను ప్రారంభించిన గణబాబు

మున్సిపల్ కార్మికునికి పరామర్శ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 98వ వార్డు పారిశుద్ధ్య కార్మికుడు,డప్పు కళాకారుడు ఎన్.రాజు అనారోగ్యంతో కెజిహెచ్ భవానివార్డ్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలియడంతో ఆదివారం జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు టి.నూకరాజు, యూనియన్ 3,4,6,8 జోన్‌ల కార్యదర్శులు గొలగాని అప్పారావు, జె.ఆర్.నాయుడు, కె.ఎస్. బాలు, ఎం.ఈశ్వరరావు, రాజు, యుజిడి వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఇ.ఆదినారాయణ, శ్రామిక మహిళ కార్యదర్శి మీనాక్షి తదితరులు కళాకారుడు ఎన్.రాజును పరామర్శించారు. వారి కుటుంబాన్ని ఓదార్చారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తామున్నామని ధైర్యం చెప్పారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ ఎంవిపి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జరిగింది. సంఘటనపై పోలీసులు అందించిన వివరాలు ప్రకారం విశాఖపట్నం శివాజీ పాలెం నివాసి అయిన ఉల్లి పోలిరాజు (38) శనివారం రాత్రి 8 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి 9 గంటలకు భార్యకు ఫోన్ చేసి మాట్లాడుతూ మాటల మధ్యలో అకస్మాత్తుగా అరిచి ఫోన్ కట్ చేశాడని తర్వాత అతని ఫోను స్విచ్ ఆఫ్ అయిందని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో ఇసుకతోట పెట్రోల్‌బంక్ సమీపంలోని డ్రైన్‌వద్ద ఒక వ్యక్తి మృతదేహం పడిఉన్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మొదట గుర్తు తెలియని మృతదేహంగా భావించి దర్యాప్తు ప్రారంభించగా దర్యాప్తులో భాగంగా అతడు ఉల్లిపోలిరాజు అని తేలిందని అతని భార్య ఉల్లి చిన్న మృతదేహం ఫోటోలు ఆధారంగా భర్తను గుర్తించిందని తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన ఎంవిపి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



అక్రమంగా ఏర్పాటు చేసిన షాపు

వేములవలస మార్కెట్లో అక్రమంగా షాపులు

ప్రజాశక్తి- ఆనందపురం : వేములవలస పూల మార్కెట్ను ఆనుకుని ఉన్న మార్కెట్ యార్డు ఎదురుగా అక్రమ షాపుల ఏర్పాటు స్థానికంగా వివాదాలకు దారితీస్తోంది. వేములవలస, లోడగలవానిపాలెం పంచాయతీల సరిహద్దులో చిరుధాన్యాల అమ్మకపు నెపంతో కొంతమంది కంటైనర్లు పెట్టి వ్యాపారాలు సాగిస్తున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో అక్రమంగా షాపులు ఏర్పాటుచేయాలని యత్నించగా అధికారులు జోక్యం చేసుకుని తొలగించారు. కానీ తాజాగా మళ్లీ కొందరు వ్యాపారులు అదే విధంగా కంటైనర్ల ద్వారా వ్యాపారాలు ప్రారంభించడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ విషయమై రెవెన్యూ అధికారులను ప్రశ్నించగా, ప్రభుత్వ భూమిలో అక్రమంగా షాపులు పెట్టకూడదని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకున్న ఓ ప్రైవేట్ వాహన డ్రైవర్ షేక్ యాసిన్కు నెల వారీ మందుల కొనుగోలుకు స్థానిక ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన వారిలో ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు కళ్ల సన్నీ, ఎం.సూర్యశ్రీనివాస్, ఎం.గోపి, జి.సాయి తదితరులు ఉన్నారు.

అసంపూర్తిగా అంగన్వాడీ భవనం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధి భద్రయ్యపేట గ్రామంలో అంగన్వాడీ భవనం అసంపూర్తిగా ఉంది. గ్రామానికి ఆనుకొని రోడ్డు మార్గంలో నిర్మాణం చేపట్టిన ఈ భవనం ప్రస్తుతం స్లాబ్, చెక్క సున్నాలు పనులు పూర్తయ్యాయి. ఇంకా ఫ్లోరింగ్, కిటికీలు, విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉంది. గోడలకు సున్నం వేసి అంగన్వాడీ పిల్లలకు సంబంధించిన కార్టూన్లు, మెనూ గోడలపై రాయాల్సి ఉంది. అంతా కలిపి రూ.2 లక్షల ఖర్చుతో పూర్తి అవుతుందని స్థానికులు అంటునానరు. పంచాయతీ నిధుల నుంచైనా ఈ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తావాలని పలువురు కోరుతున్నారు. ప్రస్తుతం అంగన్వాడీ కేంద్రం అద్దె గదిలో కొనసాగుతోంది.


అసంపూర్తిగా నిలిచిన అంగన్వాడీ భవనం

జెడ్పి హైస్కూల్లో అంకితభావంతో క్రీడా శిక్షణ


పాఠశాలలో క్రీడా కోర్టులను తయారుచేస్తున్న పిఇటిలు

ప్రజాశక్తి - ఆనందపురం : జాతీయ స్థాయి క్రీడాకారులను తయారుచేయడమే ధ్యేయంగా ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ పాఠశాలలో ప్రస్తుతం సుమారు 800 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇటీవల ఈ పాఠశాల పిఎంశ్రీ పథకానికి ఎంపిక కావడంతో క్రీడా మైదానాన్ని ఆధునీకరించారు. గతంలో పాఠశాలలో కేవలం ఒకే ఒక వ్యాయామ ఉపాధ్యాయుడు ఉండటంతో శిక్షణ కార్యక్రమాలు సక్రమంగా సాగలేకపోయాయి. ఈ ఏడాది నుంచి మరో ఇద్దరు వ్యాయామ ఉపాధ్యాయులు చేరడంతో పరిస్థితి మారింది. గతంలో నుంచీ ఉన్న ప్రసాద్, కొత్తగా వచ్చిన నరసింహమూర్తి, బుజ్జి వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. క్రీడల పట్ల ఆసక్తి చూపిస్తున్న విద్యార్థులను గుర్తించి, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ వంటి క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఆదివారం సెలవు రోజున వ్యాయామ ఉపాధ్యాయుడు బుజ్జి పాఠశాలకు వచ్చి విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. హాస్టల్ విద్యార్థులు సహా ఇతర విద్యార్థులకు కూడా శిక్షణ ఇచ్చారు. పాఠశాల మైదానాన్ని శుభ్రంగా చేయడంతో పాటు, ఆటల కోసం తగిన కోర్టులను సిద్ధం చేశారు. "జాతీయ స్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యమని, ఆగస్టు 15న అంతర్విద్యాలయ స్థాయి క్రీడాపోటీలు నిర్వహించి, ప్రతిభావంతులను ఎంపిక చేస్తామని వ్యాయామ ఉపాధ్యాయులు చెబుతున్నారు. అంకితభావంతో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులను స్థానికులు ప్రశంసిస్తున్నారు.

ప్రజాభిప్రాయం మేరకే రోడ్డు విస్తరణ : గంటా

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి - తగరపువలస రోడ్డు విస్తరణపై స్థానికుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని తుది నిర్ణయం తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సంబంధిత అధికారులకు సూచించారు. విశాఖ నగరంలోని ఎంవిపి.కాలనీలో ఉన్న అతని నివాసంలో జివిఎంసి ఒకటో జోన్ కమిషనర్ బమ్మి అయ్యప్పనాయుడు, ఇఇ ఎస్.వెంకటవాసు, పట్టణ ప్రణాళికా విభాగం ఎసిపి రామకృష్ణతో కలిసి జోన్ పరిధిలో ప్రతిపాదించిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వచ్చే ఏడాది జూన్ నాటికి భోగాపురం గ్రీన్ ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం సిద్ధం కానుండడంతో భీమిలి - తగరపువలస రోడ్డుపై రాక పోకలు బాగా పెరుగుతాయని, ఈ నేపథ్యంలో ఆ రోడ్డును 150 అడుగుల మేర విస్తరించాల్సి ఉందని అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. భవిష్యత్తు అవసరాల కోసం రోడ్డు విస్తరణ అవసరమే గానీ, స్థానికుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఎన్ని అడుగుల విస్తరణకు ఎన్ని ఇళ్లు, దుకాణాలు కోల్పోతాయో సమగ్ర నివేదికను అందజేయాలని అధికారులను ఆదేశించారు. హైవే కనెక్టింగ్ రోడ్డు కావడంతో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందనేది వాస్తవమే, అయితే స్థానికుల అభిప్రాయాలను తీసుకున్నాకే


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ముందుకెళ్లాలని సూచించారు. రూ 2 కోట్లు ఖర్చు చేయగలిగితే చిల్లపేట చెరువులోకి వస్తున్న మురుగు నీటిని మళ్లించవచ్చని అధికారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పద్మనాభం మండలం సామయ్యవలస చెక్ డ్యాం నిర్మాణంతో కనీసం 2 మిలియన్ లీటర్ల తాగు నీరు అదనంగా లభించే అవకాశాలు ఉన్నట్లు అధికారులు వివరించారు. కొండప్ప చెరువు లోకి వెళ్తున్న వర్షపు నీరు, మురుగు నీరు డ్రెయిన్లోకి మళ్లించేలా అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. భీమిలి బీచ్ రోడ్డులో కోతను నివారించేందుకు రూ.20 కోట్లతో కిలో మీటరు పొడవునా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ నివేదిక ఇచ్చిందన్నారు.

ఎన్నికల హామీల అమలుకు ఒత్తిడి తేవాలి


చిన్నశ్రీనును సన్మానిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి -పద్మనాభం : ఎన్నికల హామీలు నెరవేర్చాలని కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని భీమిలి నియోజకవర్గం వైసిపి ఇన్ఛార్జి మజ్జి శ్రీనివాసరావు పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని మద్ది గ్రామంలో మండల స్థాయి కార్యకర్త సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 14 నెలలు గడిచినా ఇచ్చిన హామీలను పక్కనపెట్టి ప్రజలను మోసగించి పరిపాలన సాగిస్తోందని విమర్శించారు. ఈ విషయమై ప్రజలను చైతన్య పరిచి ఉద్యమాల బాట నడిపించాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల్లో పేద ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసగిస్తున్నారని విమర్శించారు. ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తానని చెప్పి ఇప్పుడేమో దీపం పథకం- 2 మహిళలకే వర్తిస్తుందని ఆంక్షలు పెడుతున్నారని ఆరోపించారు. అధికారం ఉన్నా లేకపోయినా వైసిపి నేతలు ప్రజల కోసం పనిచేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిపి కె.రాంబాబు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు, మద్ది సర్పంచ్ బి.సన్యాసమ్మ, భీమిలి ఎంపిపి వాసురాజు, నాయకులు బంగారాప్పడు, ఈశ్వరరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు బి.శ్రీను, గంధవరం సర్పంచ్ జివికె.వర్మ, జి.శ్రీను, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విఎంఆర్డిఎ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 95వ వార్డు పరిధి చీమలాపల్లిలో నూతనంగా నిర్మించిన విఎంఆర్డిఎ కన్వెన్షన్ సెంటర్ను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్బాబు, విఎంఆర్డిఎ చైర్మన్ ఎం.ప్రణవ్గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం రూ.76.33 కోట్లతో విఎంఆర్డిఎ ఆమోదించిన మాస్టర్ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ఎన్నో ఏళ్లుగా వేపగుంట నుంచి పినగాడి రహదారి సమస్య ఉందన్నారు. ఈ విషయాన్ని విఎంఆర్డిఎ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడం నిధులు మంజూరుచేశారని తెలిపారు. ప్రైవేట్ కల్యాణ మండపాల్లో శుభకార్యాలు చేసుకునేందుకు రూ.లక్షల్లో చెల్లించలేని ప్రజలకు ఉపయోగపడే విధంగా విఎంఆర్డిఎ నిధులతో కన్వెన్షన్ హాల్ను నిర్మించి అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. పెందుర్తి నియోజకవర్గంలో అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎంఆర్డిఎ ఇంజినీరింగ్ అధికారులు, జివిఎంసి జోనల్ కమిషనర్ హైమావతి, కార్పొరేటర్లు ముమ్మన దేవుడు, బల్లా శ్రీనివాసరావు, వసంత శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


కన్వెన్షన్ సెంటర్ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మెడికల్ విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండలం దుక్కవానిపాలెం టోల్ ప్లాజా వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మెడికల్ విద్యార్థులు గాయపడ్డారు. అనకాపల్లి ప్రాంతానికి చెందిన ధారపాన రాకేష్ (20), యశ్వంత్ (21) ద్విచక్ర వాహనంపై సింహాచలం గుడికి వెళ్లి తిరిగి వస్తుండగా దుక్కవానిపాలెం టోల్ప్లాజా సమీపంలోని సర్వీస్ రోడ్డులో ఎదురుగా వచ్చిన కారు వీరి బైక్ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యశ్వంత్, రాకేష్కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వారిద్దరూ తగరపువలసలోని ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో అనస్థీషియా విభాగంలో రెండవ సంవత్సరం చదువుతున్నారు. ధారపాన రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం ఎస్ఐ సంతోష్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి- రావికమతం:కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని జూదరులపై కేసు నమోదు చేయడం జరిగిందని రావికమతం ఎస్ఐ రఘువర్మ తెలిపారు. మండలంలోని తోటకూరపాలెం గ్రామంలో నూకాలమ్మ తల్లి గుడి సమీపంలో కోడి పందెం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్సై రఘు వర్మ సిబ్బందితో దాడులు చేశారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకొని, 5 కోళ్ళు, నాలుగు బైకులు, 1750 రూపాయలు నగదును స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. చట్ట విరుద్ధమైన, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారి పై చట్టపరంగా తగు చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.


వైసిపి నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కెకె.రాజు

13వ వార్డులో వైసిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ, ఎస్ఆర్.నగర్లో ఆదివారం వైసిపి కార్యాలయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షులు కెకె.రాజు ప్రారంభించారు. జిల్లా మహిళా అధ్యక్షులు పేడాడ రమణి కుమారి, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, పార్టీ సానుభూతిపరులతో కలిసి ముందుగా ఆరిలోవ కాలనీ చివరి బస్టాపు వద్ద గల వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అక్కడ నుంచి పెద్దఎత్తున ర్యాలీగా బయలు దేరి పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. వార్డు వైసిపి అధ్యక్షులు సత్యాల వెంకట్ ఆధ్వర్యాన జరిగిన సమావేశంలో కెకె.రాజు, మొల్లి అప్పారావు, పేడాడ రమణికుమారి మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి అందరూ ఐక్యంగా పనిచేయాలని కోరారు. ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత కనిపిస్తోందన్నారు. కూటమి చేసిన మోసాలను ఎండగట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం మహిళా అధ్యక్షులు కె.శిరీష, మార్కెటింగ్ మాజీ చైర్మన్ అల్లంపల్లి రాజబాబు, వైసిపి సీనియర్ నాయకులు గూడపాటి విక్టర్, వానపల్లి అప్పారావు, సత్యాల సాగరిక, ఒనం వరలక్ష్మి, బేత దుర్గారావు, ఆర్ఎస్ నాయుడు, బాబూరావు, గోవిందు పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి- మధురవాడ : జివిఎంసి జోన్ -2 పరిధిలోని కొమ్మాది కూడలి నుంచి స్టేడియం వరకు సర్వీస్ రోడ్డు ఇరుపక్కల డ్రెయినేజీ పూడిక తీత పనులను కార్పొరేటర్ పిల్లా మంగమ్మ, వెంకటరావుతో కలిసి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పరిశీలించారు. చంద్రంపాలెం సమీపంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీని చూసి ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధికారులకు ఫోన్లో వివరించి, వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని బాధ్యతగా వ్యవహరించాలని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ప్రచారం

ప్రభుత్వ భూములను కాపాడండి

ప్రజాశక్తి-ఉక్కునగరం : కూర్మన్నపాలెం సర్వే నెంబర్ 27లో కోట్లు విలువ చేసిన 5.48 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుంటే రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని సిపిఐ గాజువాక కార్యదర్శి కెంగువ అచ్యుతరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.వనజాక్షి విమర్శించారు. కూర్మన్నపాలెంలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని వారు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కెంగువ అచ్యుతరావు మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఎంతో విలువైన ప్రభుత్వ భూములు, గెడ్డలు, వాగులు ఆక్రమణకు గురవుతుంటే రెవెన్యూ అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారని విమర్శించారు. కూర్మన్నపాలెంలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జాదారులు ఆక్రమిస్తుంటే వారిపై కేసులు పెట్టకుండా మొక్కుబడిగా ఒక షెడ్డు కూల్చివేయడం ఏమిటని ప్రశ్నించారు. మిగిలిన రేకుల షెడ్లను కూడా కూల్చి ప్రభుత్వ ప్రభుత్వ భూమిని రక్షించాలని, లేకుంటే తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామనిహెచ్చరించారు. ఈ ఆక్రమణలను ఆర్‌డిఓ, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. తక్షణమే భూ ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



మధుసూదనరావును సన్మానిస్తున్న మాధవధార గ్రామస్తులు

మధుసూదనరావుకు అభినందనలు

ప్రజాశక్తి -మాధవధార : ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పూజారి మధుసూదనరావుకు ఆదివారం మాధవధార కనకదుర్గ కల్యాణ మండపంలో మాధవధార గ్రామ ప్రజల ఆధ్వర్యాన అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ హాజరై మాట్లాడుతూ, మాధవధార ప్రాంతంలో బాక్సింగ్ అసోసియేషన్ ఏర్పాటు చేసి ఎంతోమంది క్రీడాకారులను తయారుచేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. బాక్సింగ్‌పై యువతకు అవగాహన కల్పించారని తెలిపారు. ఎంతోమంది బాక్సింగ్ క్రీడాకారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అధ్యక్షులు కంచరాన సూర్యనారాయణ మాట్లాడుతూ, తల్లితండ్రులు చిన్ననాటి నుంచే పిల్లలకు క్రీడల పట్ల అవగాహన పెంపొందించాలని సూచించారు. యువత క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాధవ యువజన సమాజం కన్వీనర్ సనపల రామ్‌గోపాలరావు, ఉపాధ్యాయులు సనపల ఉమాపతి, తమ్మినేని పద్మజ, కెవి.రమణ, పొన్నాడ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి -గాజువాక : మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జివిఎంసి 69వ వార్డు పరిధి తుంగ్లాంలో రూ.3 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సామాజిక భవనాలతో పాటు, కాలువలు రోడ్లకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. గాజువాక నియోజవర్గంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తానన్నారు. యువత ఉపాధి కోసం మరిన్ని కంపెనీలు విశాఖకు రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



సిసి రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



మధురవాడ రైతు బజార్ వద్ద ప్రచారం...

ప్రజాశక్తి-యంత్రాంగం

అదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని, ట్రూఅప్ ఛార్జీల పేరులో ప్రజలపై మోపిన భారాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యాన పలుచోట్ల ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు.

కొమ్మాది : అదాని స్మార్ట్ మీటర్లు, విద్యుత్ అదనపు ఛార్జీలు, ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వామపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యాన ఆదివారం మధురవాడ రైతు బజారు వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. అదాని స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పి.పైడిరాజు, డి.అప్పలరాజు, రాజ్‌కుమార్, వి.సత్యనారాయణ, డి.కొండమ్మ, ఎమ్‌డి.బేగం, ఎంఎస్.పాత్రుడు, ఎస్.రామప్పుడు, టికె.శారద, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : జివిఎంసి 86వ వార్డు పరిధి కూర్మన్నపాలెం శాతవాహననగర్, దువ్వాడ రోడ్డులో సిపిఎం స్టీల్ జోన్ కమిటీ ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎం.కృష్ణారావు, శ్రీనివాసరావు, యు.రామస్వామి మాట్లాడుతూ, స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రభుత్వం స్మార్ట్



కూర్మన్నపాలెంలో సిపిఎం స్టీల్‌జోన్ కమిటీ ఆధ్వర్యాన ప్రచారం

దోపిడీకి పాల్పడుతోందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు స్మార్ట్ మీటర్లను పగులగొట్టాలని ప్రజలకు పిలువునిచ్చి, అధికారంలోకి రాగానే అదానికి ఈ పాలకులు లొంగిపోయారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నమ్మి రమణ, దత్తాత్రేయరాజు, కె.గంగాధర్, డిసిహెచ్.వెంకటేశ్వరరావు, పూర్ణచంద్రరావు, ఒవి.రావు, రాము తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ జివిఎంసి 75వ వార్డు పరిధి చినకోరాడ, పాత అయ్యన్నపాలెం, నీలాపు వీధి, ముసలి నాయుడుపాలెంలో సిపిఎం స్టీల్‌జోన్ కమిటీ ఆధ్వర్యాన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి.వెంకట్రావు, ఎన్.రమణ, బి.గురప్ప, జి.శ్రీనివాసరావు, సిహెచ్ వెంకట్రావు, సిహెచ్.రాముడు, సింహాచలం, వెంకయ్య పాల్గొన్నారు.



ఆరిలోవలో...

ఆరిలోవ : వామపక్ష ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన ఆరిలోవలో పాదయాత్ర నిర్వహించారు. అదాని స్మార్ట్ మీటర్లు మాకొద్దు, పెంచిన ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. స్మార్ట్ మీటర్ల రద్దు కోరుతూ ఈ నెల 5వ తేదీన ఎపిఇపిడిసిఎల్ కార్యాలయాల ఎదుట నిర్వహించే ధర్నాకు ప్రజలంతా పెద్దఎత్తున తరలిరావాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.వెంకటరావు, వి.నరేంద్రకుమార్, కె.లక్ష్మణరావు, సిహెచ్.కాసుబాబు, కె.కుమారి, ఎ.దేవుడమ్మ, పి.రాజు, రత్నం, మంగ, 13వ వార్డు జివిఎంసి కార్మికులు పాల్గొన్నారు.

అనకాపల్లి : ప్రజలపై అధిక భారాలు వేసే అదాని స్మార్ట్ మీటర్లును వ్యతిరేకించాలని కోరుతూ



అనకాపల్లి గవరవీధిలో కరపత్రాల పంపిణీ

సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక గవరపాలెం రామదాసుగారి వీధిలో పెంటపాడు సన్యాసినాయుడు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి కరపత్రం ఇచ్చి అదాని మీటర్లు బిగించడం వల్ల నష్టాలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పట్టణ రైతు సంఘం నాయకులు కాళ్ల తేలయ్యబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పెంటకోట శ్రీనివాసరావు, ఏ.మల్లికార్జున్, ఏ.రామకృష్ణ, వెంకటప్పారావు, శ్రీనివాసరావు, చింతా ఓంశివ, విభిన్న ప్రతిభావంతుల సంఘం నాయకులు నూక అప్పారావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఈశ్వరరావు, అప్పారావు పాల్గొన్నారు.

వడ్డాది : విద్యుత్ వినియోగదారులందరూ స్మార్ట్ మీటర్లను బిగించడానికి వ్యతిరేకించాలని సిపిఎం మండల నాయకులు ఎస్‌వి నాయుడు, పి సాంబశివరావు ఆదివారం బంగారమెట్ట గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ గోడ పోస్టల్ అతికించారు. గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన తెలుగుదేశం కూటమి నేతలు ఇప్పుడు వాటినే ఏర్పాటు చేయడం దారుణమన్నారు.



వడ్డాది బంగారుమెట్టలో కరపత్రాల పంపిణీ

దర్జాగా ఫుట్‌పాత్ ఆక్రమణలు

- రోడ్డుపైనే వాహనాల పార్కింగ్
- నడిచేందుకు ఇబ్బందులు పడుతున్న పాదచారులు

ప్రజాశక్తి -ములగాడ : పారిశ్రామిక ప్రాంతంలో పాదచారుల కోసం రోడ్డుకిరువైపులా నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. రోడ్డుపైనే వాహనాలు నిలుపుదల చేస్తుండటంతో పాదచారులు రోడ్డు మధ్యలో నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. రూ.లక్షల్లో వెచ్చించి ప్రజల కోసం ఫుట్‌పాత్‌లు నిర్మిస్తే కొంతమంది రాజకీయ నాయకులు వాటిని ఆక్రమించి వ్యాపారస్తులకు అద్దెలకు ఇస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

యారాడ పార్క్ వద్ద ఫుట్‌పాత్‌ల పక్కన పెద్ద గెడ్డ ఉంది. ఆ గెడ్డను మూసివేసి వాటిపై దుకాణాలను ఏర్పాటుచేశారు. ఆ



ఫుట్‌పాత్‌పై ఉన్న దుకాణాలు

గెడ్డలో ఉన్న పూడికలు తీయటానికి కూడా వీలు లేకుండా పోయింది. పూడికలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. వర్షాకాలంలో ఆ గెడ్డలోని పూడికలు రోడ్డుపైకి వస్తున్నాయి. రోడ్లన్నీ చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎక్కడ నడవాలి

ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే పాదచారులు ఎక్కడ నడవాలి. రోడ్డుపై వెళ్లాలంటే వాహనాల జోరుకు భయమేస్తోంది. రోడ్డుపై నడిచి ప్రమాదాల భారిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఆక్రమణలపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

ఎన్‌వి.రమణ

ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు తగవు

రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటుచేసిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేయడం తగదు. ఈ షాపులకు వచ్చేవారు రోడ్డ వెంబడి వరుసగా వాహనాలను నిలిపేస్తున్నారు. దీని వల్ల రోడ్డు మధ్యనే నడవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

కొల్లి నూకరెడ్డి

ఉత్సాహంగా కామెడీ షో

ప్రజాశక్తి-సీతమ్మధార : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ప్రతి నెలా నిర్వహించే వినోదాల విందులో భాగంగా ద్వారకానగర్ పౌరగ్రంధాలయంలో ఆదివారం కామెడీ షోను ఉత్సాహంగా నిర్వహించారు. ఎంవి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, పుష్పమ, రాగన్‌నాయుడు, నరసింహారావు, సూర్య, ఎస్-ఎస్.నాయుడు, శేషు లఘు నాటికలు, తుమ్ము, పెళ్లిచూపులు, ధర్మం, కుక్క పేరు, నాన్న పెట్టిన బియ్యం, నాన్న పెట్టిన మినపప్పు, డబ్బు ఇచ్చేయ్ రా, పర్సు పోయింది తదితర స్కిట్స్ ప్రేక్షకులను కడుపుబ్బానవ్వించాయి. శేఖర్ కుమార్ హాస్య గుళికలు అందించారు. ముందుగా ఓం శ్రీ గురు నిత్యకళా నికేతన్ వేపగుంట గురువు శివలా మౌనిక శిష్యులు వై.సాయి ప్రణతి, ప్రగతి, దేదీప్య, తన్మయి, జిజ్ఞాస, శాస్త్రీయ నృత్యం చేశారు. కళాకారులకు అధితులు తిలక్ పట్నాయక్, సన్ మూర్తి, బి.మాల్యాద్రి, మీగడ శశిభూషణ స్వామి ద్వారా జ్ఞాపికలను అందజేశారు.

నేడు వడ్లమాని చిత్రపట ఆవిష్కరణ

ప్రజాశక్తి-విశాఖ లీగల్ : విశాఖ న్యాయవాదిగా 65 ఏళ్లకు పైగా వృత్తిలో కొనసాగి వందలాది న్యాయవాదులకు మార్గదర్శిగా నిలిచిన ప్రముఖ న్యాయవాది వడ్లమాని శ్రీరామ్మూర్తి చిత్రపటాన్ని సోమవారం విశాఖ న్యాయవాదుల సంఘం కార్యాలయంలో ఆవిష్కరించనున్నట్లు విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మొటిమర్రి కామేశ్వరశ్రీనివాస్ తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మద్ది నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

మడ అడవుల, పులుల ప్రాధాన్యతపై కథలు

ప్రజాశక్తి-సీతమ్మధార : పౌరగ్రంథాలయంలో మడ అడవులు, పులుల ప్రాధాన్యతపై ప్రఖ్యాత కథాకథన శిల్పి ఎస్.సీతశ్రీనివాస్ కథల రూపంలో పిల్లలకు ఆదివారం వినిపించారు. భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్, పబ్లిక్ లైబ్రరీ మియావాకి స్టోరీటైమ్ వీకెండ్ యాక్టివిటీలో భాగంగా ఆదివారం అంతర్జాతీయ మడ అడవుల దినోత్సవం, అంతర్జాతీయ పులి దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మడ అడవులు, పులుల ప్రాధాన్యతను పిల్లలకు ఆసక్తికరంగా తన కథల ద్వారా ప్రకృతి గొప్ప తనాన్ని ఎస్.సీతాశ్రీనివాస్ వివరించారు. ప్రకృతి తీరపు రక్షకులుగా ఎలా తీరాలను కాపాడతాయో, నేల క్షీణతను ఎలా తగ్గిస్తాయో, జలచరాలు, పక్షులకు ఆశ్రయంగా ఉంటాయో పిల్లలకు చక్కగా వివరించారు. అవి ఈనాటి అవసరమే కాకుండా రాబోయే తరాల భద్రత కోసం ఎంత ముఖ్యమో తెలిపారు.

పర్యావరణ సమతుల్యతకు చిహ్నంగా, ఆహార గొలుసులో పులి ఎలా కీలక పాత్ర పోషిస్తుందో, దాని సంరక్షణ ఎందుకు అవసరమో పిల్లలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ లైబ్రరీ కార్యదర్శి డిఎస్.వర్మ పాల్గొన్నారు.

చెరుకు సాగుపై అనాసక్తి

- గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో వచ్చే సీజన్‌లో క్రషింగ్ ప్రశ్నార్థకం?
- గానుగాటపై భరోసా కల్పించని యాజమాన్యం
- చెరుకు రైతులకు, కార్మికులకు పేరుకుపోయిన బకాయిలు
- వాగ్దాన భంగం చేసిన కూటమి నేతలు



ప్రజాశక్తి చోడవరం

ఒకప్పుడు చెరుకు సాగుకు ప్రసిద్ధిగాంచిన మాడుగుల, చోడవరం నియోజకవర్గాల్లో రైతులు నేడు చెరుకు సాగుపై అనాసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది చెరుకు సాగు పూర్తిగా తగ్గిపోయింది. ఏ ఒక్క రైతూ చెరుకు సాగు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసిన రైతులకు రెండేళ్లగా పేమెంట్లు చెల్లించకపోవడం, వచ్చే క్రషింగ్ సీజన్‌లో ఈ ఫ్యాక్టరీలో క్రషింగ్ జరుపుతుందా? లేదా? అనేది ప్రశ్నార్థకం కావడంతో చెరుకు సాగుకు ఈ దుస్థితి వచ్చింది.

ఒకప్పుడు లక్షల టన్నులు క్రషింగ్ జరిపిన గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ప్రస్తుతం వేల టన్నులకు చేరింది. వచ్చే క్రషింగ్ సీజన్‌కు నడుస్తుందో లేదో అన్న అనుమానం నెలకొంది. ఫ్యాక్టరీ పరిధిలో నాలుగు నియోజకవర్గాల్లోని 32 వేల ఎకరాల్లో చెరుకు సాగు అయ్యేది. ప్రస్తుత 3000 ఎకరాలకు సాగు పడిపోయింది. జూన్ చివరి నాటికి చెరుకునాట్లు పూర్తయ్యావి. ప్రస్తుతం ఎక్కడ నాట్లు వేయని పరిస్థితి ఏర్పడింది.

పేరుకుపోయిన బకాయిలు

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ గత ఏడాది ఒక లక్ష 9వేల టన్నులు క్రషింగ్ చేసింది. ఇందులో 14 వేల టన్నులకు మాత్రమే టన్నుకు రూ.3వేలు చొప్పున రైతులకు బట్వాడా జరిగింది. ఇంకా సుమారు రూ.30 కోట్ల వరకు బకాయి ఉంది. ఇవి కాకుండా కార్మికులకు రూ.7 కోట్లు, జీఎస్టి కోటి 50 లక్షల రూపాయలు ఇవ్వవలసి ఉంది. ప్రస్తుతం ఉన్న పంచదార, ములాసిస్ ద్వారా రూ.10 కోట్లు ఆదాయం సమకూరనుంది. వచ్చే సీజన్‌లో క్రషింగ్ జరగాలంటే పాత బకాయిలతో పాటు యంత్ర సామాగ్రి, పెట్టుబడికి రూ.12 కోట్ల వరకు అవసరమవుతుంది. అంటే సుమారుగా 50 కోట్ల రూపాయలు ఉంటే తప్ప వచ్చే ఏడాది ఫ్యాక్టరీ నడిచే పరిస్థితులు కనపడలేదు.



చెరుకు సాగు చేసే భూమిలో వేసిన సరుగుడు తోట

చెరుకు పంటకు రైతుల దూరం

గిట్టుబాటు కాకపోయినా ఫ్యాక్టరీ ఇచ్చే అరకొర ధరతో రైతులు చెరుకు సరఫరా చేసేవారు. అయితే గత రెండేళ్లుగా సరఫరా చేసిన రైతులకు పేమెంట్లు ఇవ్వకపోవడంతో చెరుకు సాగు చేయడానికి రైతులు మక్కువ చూపడంలేదు. అదనపు సౌకర్యాలు మాటలు ఎలాగున్నా కనీసం చెరుకు సరఫరా చేసిన వాటికి చెల్లింపులు జరిగితే చెరుకు సాగు చేసేవాళ్లమని రైతులు అంటున్నారు. ఆ పరిస్థితి లేకపోవడంతో సరుగుడు, కొబ్బరి, యూకలిప్టస్ వంటి పంటల సాగు వైపు రైతులు వెళుతున్నారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణాన్ని బట్టి చూస్తే ఫ్యాక్టరీకి 20 వేల నుండి 30 వేల టన్నులకు మించి చెరుకు వచ్చే పరిస్థితి కనబడటం లేదు. ఈ చెరుకుతో నిర్వహణ సాధ్యం కాదని ఫ్యాక్టరీ వర్గాలు అంటున్నాయి. పొమ్మనకుండా పొగా పెట్టిన చందంగా పేమెంట్లు ఇవ్వకుండా తమను ప్రభుత్వాలు చెరుకు పంటకు దూరం చేశాయని రైతులను అంటున్నారు.

రైతులను మోసగించిన కూటమి ప్రభుత్వం

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి నాయకులు గోవాడ చక్కెర కర్మాగారంపై చేసిన వాగ్దానాలన్నింటినీ మూటకట్టి మూలనపడేశారు. ఎన్నికల సమయంలో కె.కోటపాడు మండల గుల్లెపల్లి గ్రామంలో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో పాల్గొన్న చంద్రబాబునాయుడు గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి పూర్వ వైభవం తీసుకొస్తామని చెప్పారు. వడ్డాదిలో జరిగిన యువగళం పాదయాత్ర బహిరంగ సభలో నారా లోకేష్ టన్నుకు రూ.4వేలు చెల్లిస్తామని పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీకి కట్టుబడి అమలు చేస్తామని వాగ్దానం చేశారు. ఎన్నికల ప్రచారంలో అయితే అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ వంటి వారు ఫ్యాక్టరీని లాభాల బాటపట్టిస్తానని హామీలు గుప్పించారు. కాని గెలిచి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గత సీజన్‌లో చెరుకు సరఫరా చేసిన రైతులకు పేమెంట్లు కూడా పూర్తిగా చెల్లించలేదు. ఒడిదుడుకులతో కొట్టుమిట్టాడుతున్న ఈ సుగర్ ఫ్యాక్టరీని గట్టెక్కించే ఏ ఒక్క ప్రయత్నమూ కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు చేయలేదు. సరికదా, ఎటువంటి సాయం అందించకుండా మొండిచేయి చూపిందని చెప్పవచ్చు.

చెరుకు సాగు రైతులకు భారమైంది



ప్రతి ఏడాది గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి 30 టన్నుల వరకు చెరుకు సరఫరా చేసే వాడిని. గత ఏడాది పేమెంట్ రాకపోవడంతో ఈ ఏడాది ఒక్క టన్ను చెరుకు కూడా సాగు చేయలేదు. పెట్టుబడులు పెరిగిపోవడంతో చెరుకు సాగు రైతులకు భారమైంది.

- కొయిలాడ సూరిబాబు (రైతు)

చెరుకు సాగు మానేశాను



గతంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులకు అండగా ఉండటంతో భూమిని కౌలుకి తీసుకొని చెరుకు సాగు చేసే వాడిని. ప్రతి ఏడాది ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసిన వెంటనే నగదు బట్వాడా అయ్యేది. కాని రెండేళ్ల నుండి పేమెంట్లు సరిగా లేకపోవడంతో చెరుకు పంటను సాగు చేయడం మానేశాను.

- పెంటకోట నాగేశ్వరరావు (కౌలురైతు)

ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి



దీనావస్థలో ఉన్న సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటే తప్ప గట్టెక్కే పరిస్థితి లేదు. ఈ ఏడాది క్రషింగ్ ప్రారంభం కావాలంటే సుమారు రూ.12 కోట్లుతో మరమ్మతులు చేపట్టవలసి ఉంది. రైతులు, కార్మికులకు చెల్లించవలసిన బకాయిలు చెల్లించకపోతే ఫ్యాక్టరీకి చెరుకు వచ్చే పరిస్థితి లేదు. తక్షణమే ప్రభుత్వం సాయి అందించి ఫ్యాక్టరీ రైతులను, కార్మికులను ఆదుకోవాలి.

- సరగడం రాముసాయుడు, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ నాయకులు



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షులు మాణిక్యం

ఐద్వా మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పరవాడ : అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మండల మహాసభ ఆదివారం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం సమక్షంలో జరిగింది. మహాసభలో పలు ప్రజా సమస్యలపై చర్చించారు. మండలంలో స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు ఐద్వా ముందుండి పోరాడాలని నిర్ణయించారు. బెల్టు షాపులను పూర్తిగా ఎత్తివేయాలని, నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా తగ్గించాలని, నివాస ప్రాంతాల్లో మినరల్ వాటర్ సరఫరా నిరంతరాయంగా చేయాలని, విషజ్వరాలపై సర్వే నిర్వహించి మందులు పంపిణీ చేయాలని, మహిళలపై పెరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, రేషన్ డిపో ద్వారా నాణ్యమైన బియ్యంతోపాటు 14 రకాల నిత్యావసర వస్తువులు అందించాలని, పరవాడ మండలంలో పరిశ్రమల కాలుష్యాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని, బొగ్గు లారీల దుర్వినియోగాన్ని నియంత్రించాలని మహాసభలో తీర్మానించారు. అనంతరం మండల కమిటీ ఎన్నిక జరిగింది. ఐద్వా మండల అధ్యక్షులుగా మన్యాల బంగారమ్మ, కార్యదర్శిగా తుంపాల అన్నపూర్ణ, కమిటీ సభ్యులుగా అరుణ, రాజకుమారి, సంతోదేవి, వరలక్ష్మి, బేగం, బంగారం మంగమ్మ, లక్ష్మి, సీత ఎన్నికయ్యారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శి రజనిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రా మత్స్యకార జెఎసి జిల్లా అధ్యక్షుడు అర్జిల్లి అప్పలరాజు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శి రజని తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ గ్రామ ప్రజలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఎంపీడీవోకి, అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు ఆధారాలతో కూడిన లిఖిత పూర్వక ఫిర్యాదులు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు కూటమి రాజకీయ నాయకుల అండ ఉందని, తనను ఎవరూ ఏమీ చేయలేరని గర్వంతో చెప్పుకుంటుందని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి రజనీపై తగిన చర్యలు తీసుకోవాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, టిడిపి ఇన్‌చార్జి గండి బాబ్జీకి విజ్ఞప్తి చేశారు.

నీటి తీరువా వసూలు నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి -మునగపాక : కూటమి ప్రభుత్వం రైతుల నుండి నీటి తీరువా వసూలు తక్షణమే నిలుపుదల చేయాలని ఏపీ రైతు సంఘం మండల ఉపాధ్యక్షులు కాండ్రేగుల రాము డిమాండ్ చేశారు. మండలంలోని తోటాడ పంచాయతీలో ఆదివారం రైతు సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కాల్వలలో పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతో వ్యవసాయానికి సరిపడా నీరు ప్రవహించక రైతులు సాగు చేయలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావ పరిస్థితుల వలన గెడ్డలలోను, చెరువుల్లోను నీరు కనిపించిన దాఖలలు లేవన్నారు. ఈ విపత్కర పరిస్థితులలో రెవెన్యూ అధికారులు వ్యవసాయానికి నీటి తీరువా కట్టాలని డిమాండ్ నోటీస్ జారీ చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నీటి తీరువ వసూళ్లను నిలుపుదల చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆళ్ల మహేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు పెంటకోట జోగినాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నేత కాండ్రేగుల రాము

చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-మునగపాక : రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ అన్నారు. స్థానిక రైతు కమతాల్లో రైతులు, పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం అమలు ద్వారా మరొకసారి రైతు పక్షపాతి అని రుజువైందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పెంటకోట విజయ్, నాయకులు విల్లూరి నూక నరసింహారావు, పెంటకోట శ్రీరామ్మూర్తి, సూరిశెట్టి అప్పలనాయుడు, బుద్ధ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న సాయికృష్ణ, టిడిపి నాయకులు

ఆటో, మోటార్ కార్మికులను ఆదుకోవాలి



నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

ప్రజాశక్తి-కశింకోట : ఆటో, మోటారు కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు ఆధ్వర్యాన మండలంలోని నర్సింగబిల్లి జాతీయ రహదారి పక్కన ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నుండి ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యాన్ని కల్పిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఆటో, వ్యాను, టాక్సీ తదితర మోటార్ వాహనాల మీద ఆధారపడి జీవించే కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, టెక్నికల్, ఉన్నత చదువులు చదివిన సరైన ఉద్యోగ అవకాశాలు లేక ఆటో, వ్యాన్, టాక్సీ తదితర మోటార్ వెహికల్స్‌ను అప్పులు చేసి కొన్నుకొని వాటి ద్వారా కుటుంబాలను పోషించుకుంటున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో ఈ వాహనాలకు సర్వీసు లేకపోతే వారు అప్పులకు వడ్డీలు కట్టలేక, కుటుంబ పోషణ సాగక రోడ్డున పడే పరిస్థితి ఉంటుందని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం వీరిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శివశంకర్, ఎం.వర, ఎం.శ్రీను, ఎం.బాలాజీ, పి.రాజు, ఎన్.రవి, ఎన్.సీతారాం, రాజు, ఎంఎస్ఎన్.నాయుడు, అప్పారావు పాల్గొన్నారు.

శివారు గ్రామాలకు రేషన్ కష్టాలు

అవస్థలు పడుతున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి-కోటవురట్ల

కూటమి ప్రభుత్వం ఎండియులను రద్దు చేసి రేషన్ దుకాణాల వద్ద సరుకులు పంపిణీ చేసే విధానం పునరుద్ధరించడంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. మండల వ్యాప్తంగా 38 రేషన్ దుకాణాలకు గాను దాదాపుగా 15 గ్రామాలలో శివారు గ్రామాలు ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. అయితే కొన్ని గ్రామాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినా కొన్ని గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడక తప్పడం లేదు. వీటిలో ప్రధానంగా గిరిజన గ్రామాలు ఉండటం విశేషం. రామచంద్రపురం శివారు గ్రామం అలుముయపాలెం పంచాయతీ కేంద్రానికి సుమారు 8 కిలోమీటర్లు దూరంలో ఉంది. వెంకటాపురం గ్రామానికి శివారు గ్రామం బోయిన కొత్తూరు రెండున్న కిలోమీటర్లు ఉంటుంది, కొడవటిపూడి శివారు గ్రామం కోదండరాంపురం 3 కిలోమీటర్లు ఉంటుంది. గుట్టువాడ శివారు అణుకు గ్రామం 5 కిలోమీటర్లు దూరం ఉంటుంది. ఈ గ్రామాల ప్రజలు ప్రతి నెల రేషన్ తీసుకునేందుకు కాలినడకన పంచాయతీ కేంద్రానికి రావాల్సిన పరిస్థితి నెలకొంది. సరైన రోడ్డు సౌకర్యాలు కూడా లేకపోవడంతో రేషన్ లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. అణుకు, కోదండరాంపురం గ్రామాల పరిస్థితి మరీ అధ్వానం. గతంలో రేషన్ వాహనం ఇంటికి వచ్చి సరుకులు అందజేసేదని ప్రస్తుతం దుకాణాలకు వెళ్లి తెచ్చుకొనేందుకు నడిచి లేదా ఆటోలకు రూ.40 ఖర్చు చేసి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితి మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో కూడా ఉంది. మండల కేంద్రం కోటవురట్లకు జానకిరాంపురం, గవరపేట గ్రామస్తులు రావలసిన పరిస్థితి ఉంది. అధికారులు ఇప్పటికైనా ఆయా గ్రామాలకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసి రేషన్ సరుకులు అందజేయాలని ఆయా ప్రాంత వాసులు కోరుకుంటున్నారు.



గొట్టువాడ శివారు అణుకు గ్రామస్తులు రేషన్ సరుకులకు వెళుతున్న దృశ్యం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు

న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి భార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఘనంగా జరిగింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన ఈ టోర్నమెంట్‌లో న్యాయవాదులు నాలుగు టీములుగా ఏర్పడి ఏఎంఏఎల్ కాలేజ్ గ్రౌండ్లో క్రికెట్ ఆడారు. పదో అదనపు జిల్లా జడ్జి నరేష్, అడిషనల్ సబ్ కోర్ట్ జడ్జ్ రామకృష్ణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ధర్మారావు పాల్గొని టోర్నమెంట్ను ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిల్లా హర శ్రీనివాసరావు, సెక్రటరీ బంధం రమణ, ఉపాధ్యక్షులు సుంకర శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-చోడవరం

తల్లి పాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్ సూర్యలక్ష్మి అన్నారు. ఆదివారం చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద తల్లులు తమ పిల్లలకు పాలిచ్చే విధంగా ప్రత్యేకంగా ఓ గదిని ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజుతో కలిసి ఆమె దానిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యలక్ష్మి మాట్లాడుతూ గర్భిణీగా ఉన్నప్పుడే సరైన పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనిస్తారని తెలిపారు. మొదటి 1 గంట లోపు ఇచ్చే ముర్రు పాలు బిడ్డకు మొదటి టీకా వంటివని, బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతో పాటు తల్లి, బిడ్డకు అనుసంధానం పెంచుతుందని చెప్పారు. ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు ఆధ్వర్యంలో సీతారామ కళ్యాణ మండపంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు, 7 నెలలు దాటిన పిల్లలకు అన్నప్రాసనలు చేశారు. గోవాడ ఉన్నత పాఠశాలలో కౌమార దశలో బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్య వివాహాలు జరగడం వలన జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రమాదకర సమయంలో చేయవలసిన హెల్ప్ లైన్ నెంబర్ల తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ వి.మంగతాయారు, అదనపు సి.డి.పి.వో పుష్పదేవి, మెడికల్ ఆఫీసర్, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దాలివలసలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని దాలివలస గ్రామంలో సంఘమిత్ర రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దాలివలస పరిసర గ్రామాలకు చెందిన 120 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. విశాఖపట్నం కెజిహెచ్‌కి చెందిన ఈఎన్‌టి వైద్య నిపుణులు డాక్టర్ బండారు రామచంద్రరావు ఆధ్వర్యంలోని వైద్య బృందం వైద్య సేవలు అందించారు. ఒమేగా ఆస్పత్రికి చెందిన డాక్టర్ చెన్నకేశవరెడ్డి క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి బొంతు మంగపతిరావు, సూరెడ్డి బాబురావు, మండల మురళీకృష్ణ, కిలపర్తి శ్రీనివాసరావు సూరిరెడ్డి శ్రీనివాసరావు, బొడ్డు అప్పలనాయుడు, బండారు వెంకట రమణమూర్తి, కన్నూరు అప్పలనాయుడు, గాలి సతీష్, రొంగలి నాగేశ్వరరావు, గిడుతూరి దేముళ్ళు, ఆదిరెడ్డి అబద్ధం, లెక్కలగోపి పాల్గొన్నారు.




నేత్ర పరీక్షలు చేస్తున్న నిపుణులు

పూర్వ విద్యార్థుల ఆత్మీక కలయిక

మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్చుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006వ సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారము స్నేహితుల దినోత్సవం సందర్భంగా కలుసుకున్నారు. అచ్చుతాపురంలో హ్యాపీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని, ఏక వచనంతో ఏరా ఏం చేస్తున్నావ్, ఎలా ఉన్నావ్, కుటుంబం సభ్యులు ఎలా ఉన్నారు అంటూ ఒకరి యోగక్షేమలు మరొకరు తెలుసుకున్నారు. చదువుకున్న కాలంలో గడిపిన రోజులను నెమరు వేసుకున్నారు. డాక్టర్లు, ఇంజనీర్లు, స్లాఫ్‌వేర్, సివిల్ సర్వీసెస్, వ్యాపారులుగా స్థిరపడిన వారంతా తమను తాము పరిచయం చేసుకున్నారు. ఆటపాటలతో సామూహిక భోజనాలతో కాలం గడిపారు. తమతో చదువుకొని అనారోగ్యంతో రెండు నెలల క్రితం చనిపోవడంతో, వృద్ధాప్యంలో ఉన్న తండ్రి అప్పలనాయుడుకు రూ.65 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.



స్నేహితుని తండ్రికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

శిథిలావస్థకు వాటర్ ట్యాంక్

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలం లో పాములవాక గ్రామం ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది, సుమారు 40 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ వాటర్ ట్యాంక్ ప్రస్తుతం పిల్లర్లు దెబ్బతిన్నాయి. ట్యాంక్ నుండి నీరు కూడా కారి పోతూ దర్శనమిస్తుంది. ప్రధాన రహదారి కావడంతో పాటు సమీపంలో రైతు సేవా కేంద్రం పాఠశాల, విద్యుత్ సబ్ స్టేషన్ ఉంది. నిత్యం రద్దీగా ఉండే రహదారి కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ట్యాంకను తొలగించి కొత్త ట్యాంకు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.



శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకు

ఘనంగా స్నేహితుల దినోత్సవం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి గవరపాలెం పరమేశ్వరి పార్క్‌లో ఆదివారం స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జగన్నాథ స్వామి దేవస్థానం చైర్మన్ దాడి బుజ్జి ఆధ్వర్యంలో మిత్రులందరూ కలుసుకొని కేక్ కట్ చేశారు. ఒకరికొకరు ఫ్రెండ్షిప్ బ్యాండ్ చేతికి కట్టి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, యల్లపు నూకరాజు, పోలారపు త్రినాథ్ మారిశెట్టి కుమార్, యల్లపు శీను, కర్రి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలలోని పలు గ్రామాలలో చిన్నారులు స్నేహితుల దినోత్సవం సందర్భంగా సందడి చేసారు. సామాజిక మాధ్యమాల్లో ఫోటోలు, శుభాకాంక్షల సందేశాలు విరివిగా పంచుకున్నారు.

కశింకోట : కశింకోటలో స్నేహితులు దినోత్సవం సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన ఎన్ఎన్. అప్పారావు ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఇసిఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, జీవిత బీమా ఏజెంట్‌లు సైదు నాయడు, శ్రీను, పలువురు స్నేహితులు పాల్గొన్నారు.



కశింకోటలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

దోమల నివారణకు ఫాగింగ్

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు నివారణలో భాగంగా శనివారం రాత్రి తాళ్లపాలెం, బంగారయ్య పేట గ్రామంలో ప్రత్యేక దోమల నివారణ చర్యలు చేపట్టారు. గ్రామంలోని ప్రతి వీధిలో ఫాగింగ్ యంత్రాల ద్వారా దోమల నివారణ మందును స్ప్రే చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గల్లా రాజు, పంచాయితీ ఈవో సత్య ప్రసాద్ పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ట

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వాకపల్లి పాండవల మెట్టపై శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభం ప్రతిష్ట మహోత్సవం అంగరంగవైభవంగా జరిగింది. స్వామివారి విగ్రహాలకు అభిషేకాలు, అలంకారాలు జరిపారు. మండల నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ముర్రు ముత్యాలునాయుడు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆవుగడ్డ రామ్మూర్తి నాయుడు, ఆవుగడ్డ కోటిపల్లి నాయుడు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ధ్వజస్తంభం ప్రతిష్టలో పాల్గొన్న పెద్దలు

ఘనంగా సత్తమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి గవరపాలెం సత్తమ్మ తల్లి ఆలయం 34వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ ఆహ్వానం మేరకు వైసిపి అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మలసాల భరత కుమార్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 30 వేల మందికి అన్న సమారాధన చేస్తున్న కమిటీ వారిని అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ శివ, పట్టణ యువజన విభాగ అధ్యక్షులు వేగి త్రినాథ్, జిల్లా వైద్య విభాగ అధ్యక్షులు డాక్టర్ సిద్ధార్థ, యల్లపు గాంధీ, నియోజవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు గైపూర్ రాజు, దండా జ్ఞానదీప్, టౌన్ మహిళా అధ్యక్షురాల కాండ్రేగుల హైమావతి, నియోజవర్గ సోషల్ మీడియా ఇంచార్జ్ కాండ్రేగుల శ్యామ్, కాండ్రేగుల రమణబాబు, టి చరణ్, రాపేటి మహాలక్ష్మి నాయుడు, ఆలయ కమిటీ నిర్వాహకులు మద్దాల సీతారాం, బుద్ధ కిశోర్, భీమేశ్వర రావు, బొడ్డేడ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రైతు జిల్లా సమావేశం

అనకాపల్లి రూరల్ : తెలుగుదేశం పార్లమెంట్ కార్యాలయంలో జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గొల్లవిల్లి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ- పిఎం కిసాన్ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 46.86 లక్షల మందికి రైతులు ఖాతాలో 3174.43 కోట్ల రూపాయలు జమ చేసినట్లు చెప్పారు. అనకాపల్లికి రూ.161.45 కోట్లు నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, కార్యదర్శి దాడి ముసలి నాయుడు, నాయకులు కాలింగ సన్యాసినాయుడు, మల్ల వరాహ నరసింహారావు, కే సాంబశివరావు, మల్ల శేషు, దాడి బాలాజీ, వుల్లూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి జంక్షన్ టెన్షన్..టెన్షన్..

- హైవేపై వాహనాల రద్దీ
- రోడ్డు దాటాలంటే భయాందోళన
- నిత్యం ప్రమాదాలు



ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలి వద్ద భయపడుతూ రోడ్డు దాటుతున్న వాహనదారులు

ప్రజాశక్తి- నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిపై రెండు ప్రధాన జంక్షన్‌లు అనుక్షణం టెన్షనే. ఎప్పుడూ వాహనాల రాకపోకల రద్దీతో జాతీయ రహదారి ఉండడంతో రోడ్డు దాటాలంటే జనం హడలి పోతున్నారు. నక్కపల్లి జాతీయ రహదారిపై ఉపమాక వెళ్లే ఆర్చి జంక్షన్, కాంప్లెక్స్ కూడలి జంక్షన్‌లు ప్రమాదాలకు నిలయంగా మారాయి.

నక్కపల్లి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు రాకపోకలు సాగించాలంటే బస్సు ఎక్కేందుకు నక్కపల్లి రావాల్సిందే. ప్రయాణికులు , ఉద్యోగులు, కూలీలు, వివిధ వృత్తిదారులు, విద్యార్థులు ఈ రెండు జంక్షన్‌ల వద్ద రోడ్డు దాటాలంటే వణికి పోతున్నారు. ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని రోడ్డు దాటిన తర్వాత హమ్మయ్య అని అనుకుంటున్నారు. చీకటి పడిందంటే రోడ్డు దాటాలంటే సాహసమనే చెప్పాలి. విశాఖ వైపు వెళ్లే మార్గంలో ప్రయాణికులు బస్సు ఎక్కాలంటే రోడ్డు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా విద్యార్థులు ఎలమంచిలి వైపు బస్సు ఎక్కాలంటే రోడ్డు దాటి ఎక్కవలసి వస్తుంది. కాంప్లెక్స్ ఉన్నప్పటికీ బస్సులు కాంప్లెక్స్‌లోకి రాలేదు. దీంతో తప్పని పరిస్థితిలో భయపడుతూ రోడ్డు దాటవలసి వస్తుంది. రోడ్డు దాటే సమయంలో ఇప్పటికే అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.



ఉపమాక ఆర్చి జంక్షన్ వద్ద మలుపులో రోడ్డు పక్కన నిలుపుదల చేసిన ఆటో

ముఖ్యంగా ఉపమాక వెళ్లే ఆర్చి జంక్షన్ అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఉపమాక మార్గం గుండా బైకులు, ఇతర వాహనాలు హైవే ఎక్కే సమయంలో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉపమాక ఆర్చి జంక్షన్ వద్ద హైవేపై ప్రయాణికులను ఎక్కించుకు నేందుకు ఆటోలు రోడ్డుపై నిలుపుదల చేయడంతో ఉపమాక మార్గం గుండా వచ్చే బైక్ లు, ఇతర వాహనాలు రోడ్డుపై జీబ్రా లైన్ దాటి మార్గ మధ్యలోకి రావలసి వస్తుంది. ఈ సమయంలో వెనుక నుంచి వచ్చే వాహనాలు ఢీకొంటున్నాయి. ఇప్పటికే ఈ జంక్షన్ లో అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అనేకమంది మృత్యువాత పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యంగా ఉపమాక ఆర్చి జంక్షన్ వద్ద హైవేపై ఆటోలను నిలుపుదల చేయకుండా పోలీసులు చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. జాతీయ రహదారిపై నిత్యం వాహనాల రద్దీ పెరిగింది. దానికి తోడు స్పీడు నియంత్రణ లేకుండా పోయింది. కనీసం జంక్షన్ ల వద్ద కూడా వాహనదారులు స్పీడ్ తగ్గించని పరిస్థితి నెలకొంది. రెండు జంక్షన్ల వద్ద పోలీసులను ఏర్పాటు చేసి, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాల్సి ఉంది.

ఉపమాక ఆర్చి జంక్షన్ వద్ద ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆటోలు నిలుపుదల చేయకుండా నియంత్రించి, జంక్షన్ దాటిన తర్వాత కొంతదూరంలో నిలుపుదల చేసి ప్రయాణికులను ఎక్కించుకునే విధంగా చర్యలు చేపట్టాలి. అదేవిధంగా నక్కపల్లి జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలి

ప్రయాణికులు,వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని నక్కపల్లిలో బైపాస్ రోడ్డు ఏర్పాటుచేయాలి. నక్కపల్లిలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ విపరీతంగా పెరగడంతో రెండు జంక్షన్ల వద్ద రోడ్డు దాటాలంటే చాలా భయంగా ఉంది. ఇప్పటికే అత్యధికంగా వాహనాల రాకపోకలు, ప్రయాణికులు, జనం రద్దీ పెరగడంతో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రానున్న కాలంలో ఈ ప్రాంతమంతా పారిశ్రామిక వాడగా మారనున్నది. వాహనాలు రాకపోకలు, జనం, ప్రయాణికుల తాకిడి మరింతగా పెరగనున్నది. దీనిని దృష్టిలో పెట్టుకుని తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. నక్కపల్లిలో సెంట్రల్ లైటింగ్, సర్వీస్ రోడ్డు కూడా ఏర్పాటు చేయాలి.



- మేడేటి శంకర్, నక్కపల్లి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాజు

మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: అనకాపల్లి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా గౌరవ అధ్యక్షులు అడిగర్ల రాజు పిలుపునిచ్చారు. ఆదివారం నర్సీపట్నం, బలిఘటం, బైపిరెడ్డిపాలెం, బీసీ కాలనీ, కాపు వీధిలలో భవన నిర్మాణ కార్మికుల సర్వసభ్య సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిగర్ల రాజు మాట్లాడుతూ, జిల్లా మహాసభలు రాంబిల్లి మండలంలో ఈనెల 5వ తేదీన జరుగుతాయన్నారు. ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుండి భవన నిర్మాణ కార్మికులు, ఇతర నిర్మాణరంగ కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరు కానున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమాలకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కే రామకృష్ణ, మర్రి రమణ, చిన్న, శ్రీరాములు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



డెంటల్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

డెంటల్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి- రావికమతం: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రైవేటు దంత వైద్య క్లినిక్ ను సద్వినియోగం చేసుకోవాలని చోడవరం శాసనసభ్యులు కెఎస్ఎన్ ఎస్ రాజు కోరారు. . ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన వెంకట్ డెంటల్ క్లినిక్ ను చోడవరం శాసనసభ్యులు కే ఎస్ ఎన్ ఎస్ రాజు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు రాజు మాట్లాడుతూ ప్రస్తుతం పంటి సమస్యలు వయసుతో సంబంధం లేకుండా అతి ఎక్కువగా రావడం జరుగుతుందన్నారు. పంటి సమస్యలు వచ్చినప్పుడు చోడవరం, నర్సీపట్నం, అనకాపల్లి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, మన ప్రాంతంలోనే దంత వైద్యశాలను ఏర్పాటు చేయడంతో ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రావికమతం మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు కోమటి శంకర్రావు, స్థానిక సర్పంచ్ గెంజి మోది నాయుడు, ఎంపిటిసి వేపాడ నాగేశ్వరరావు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రాజనకొండ నాయుడు, గొంప, తట్టబంద ఎంపీటీసీలు, సూర్యనారాయణ, శేషుబాబు, తదితరులు పాల్గొన్నారు.



హోంమంత్రిని కలిసిన నాయకులు

తెలుగు యువత మండల అధ్యక్షునిగా శివరామకృష్ణ రాజు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలో వేంపాడు గ్రామానికి చెందిన కమ్మేల శివరామకృష్ణరాజును తెలుగు యువత మండల అధ్యక్షునిగా రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత నియమించారు. ఈ మేరకు హెూం మంత్రి అనితను శివ శివరామ కృష్ణంరాజు స్థానిక నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, నాయకులు కురందాసు నూకరాజు, శ్రీకాంత్, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు పని చేస్తే గుర్తింపు

జనసేన విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షులు రమేష్ బాబు



రమేష్‌బాబును సత్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : పార్టీ పటిష్టత కోసం పని చేసే వారికి ప్రత్యేకమైన గుర్తింపు, ఆదరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉమ్మడి జనసేన విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు హితవు పలికారు. నర్సీపట్నం మున్సిపాలిటీలో జోగినాథుని పాలెంలో జనసేన అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ కార్యాలయం ప్రారంభించారు.ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ పార్టీలో నూతన ఉత్తేజానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పార్టీ కోసం కష్టాన్ని ఇష్టంగా చేసుకొని పని చేసే వారికి ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ ఆవిర్భవించిన దశాబ్ద కాలంలో నర్సీపట్నంలో జనసేన పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. తాను ఎవరికీ వ్యతిరేకిని కాదని పార్టీ కోసం ఎవరు మంచి చేస్తున్నారో, ఎవరు వ్యతిరేకంగా పనిచేస్తున్నారో వారి కోసం అధిష్టానానికి తెలియజేసే వారిదిగా ఉంటానన్నారు.. స్థానిక ఎన్నికల్లో పోటీ పడాలంటే గ్రామ,వార్డు స్థాయిలలో పార్టీ బలోపేతం కావాలన్నారు. ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ,స్థానిక సంస్థల ఎన్నికలలో జనసేన విజయ డంకా మోగించడం ఖాయమని జోష్యం చెప్పారు. చోడవరం నియోజకవర్గం ఇంచార్జ్ పి వి ఎస్ ఎన్ రాజు మాట్లాడుతూ, అవినీతికి అక్రమాలకు తావు లేకుండా పాలన చేయడం జనసేన పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ తమ్మి రాజ్యలక్ష్మి, తొమ్మిదో వార్డ్ కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య, పట్టణ ప్రధాన కార్యదర్శి అద్దేపల్లి గణేష్, నాయకులు దొరబాబు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-అరకులోయ: కెజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అల్లూరి జిల్లా ఏపీసి డాక్టర్ స్వామి నాయుడు, అరకులోయ మండల విద్యాశాఖ అధికారి వి త్రినాథ్‌లు కోరారు. స్థానిక గుడ్ మార్నింగ్ రిసార్ట్స్‌లో నిర్వహిస్తున్న ఈ శిక్షణను ఆదివారం వారు ప్రారంభించారు. ఈ శిక్షణలో పలు జిల్లాల్లోని కేజీబీవీ లలో పనిచేస్తున్న సోషల్ స్టడీస్ సిఆర్‌టి ఉపాధ్యాయులు మొదటిసారిగా ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఈ శిక్షణ ఈనెల మూడు నుంచి ఏడో తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిసి డిఓ కవిత, అబ్జర్వర్ రమేష్, శైలజ, సిఆర్పిలు జి.వాసు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల ప్రాముఖ్యతపై అవగాహన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయధికారిణి పి దమయంతి ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు గ్రంథాలయం ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులకు జీకే ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. గ్రంథాలయకు వచ్చి చదువుకుంటే విజ్ఞానం పెంపొందుతుందన్నారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి ప్రభాకర్ మాట్లాడుతూ, స్నేహితుల దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు.



అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి

మండుతున్న ఎండలు.. ఎండుతున్న వరి...

జాడ లేని చినుకు
ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి -నక్కపల్లి: వర్షాలు ముఖం చాటేయడంతో ఆదిలోనే అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వేసవిని తలపించేలా ఎండలు మండుతుండడంతో అన్నదాతలు దిగులు చెందుతున్నారు. మండుతున్న ఎండలకు అక్కడక్కడ మొలకెత్తిన వరి ఎండుతుంది. ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే నీటి కష్టాలు ప్రారంభం అవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలో ఖరీఫ్ సీజన్ కు సంబంధించి 4,850 ఎకరాల్లో వరి సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 920 క్వింటాళ్ల వరి విత్తనాలను వివిధ రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచి జూన్ నెలలో రైతులకు విత్తనాలు సరఫరా చేశారు. జులై నెల మొదటి వారంలో వర్షాలు కురవడంతో రైతులు ఎంతో ఆశతో వరి నారుమడులు సిద్ధం చేసుకుని, వరి నారు కోసం వరి విత్తనాలు జల్లారు. వరి విత్తనాలు జల్లిన దగ్గర నుండి వర్షాలు ముఖం చాటేయడం, వేసవిని తలపించేలా ఎండలు మండిపోవడంతో అక్కడక్కడ మొలిసిన వరి ఎండిపోవడం ప్రారంభమైంది. కొన్నిచోట్ల వర్షాలు లేక వరి విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో, అన్నదాత ఆకాశం వైపు వర్షం కోసం ఎదురుచూసినప్పటికీ నెల రోజుల నుండి చినుకు జాడలేదు. దీంతో అన్నదాతలు దిగులు చెందుతున్నారు.

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ వరి నాట్లు పడతాయా లేదా మీ మాంసంలో కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలో ఉపమాక, నక్కపల్లి, కాగిత, చినదొడ్డిగల్లు, ఉద్దండపురం, గొడిచెర్ల, డొంకాడ, ముకుందరాజుపేట, రమణయ్యపేట,దేవవరం తదితర గ్రామాల్లో రైతులు వరి సాగును ఎక్కువగా పండిస్తుంటారు. వర్షాలు ముఖం చాటేయడంతో వరి సాగుపై రైతుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి.

మండుతున్న ఎండలకు వరి నారు ఎండిపోయే స్థితికి రావడంతో అక్కడక్కడ బావులు, నీటి సదుపాయం ఉన్న రైతులు మోటారుతో సాగునీటిని పైపులు ద్వారా వరి నారు మడులను తడుపుతున్నారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు నెల రోజుల నుండి వరి మడులకు తడులు పెడుతూ వరి ఆకును రక్షించుకుంటున్నారు. అయినప్పటికీ ఎండలు మండిపోవడంతో వరి ఆకు ఎండిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమయంలోనైనా వరుణుడు కరుణించి నాలుగు చినుకులు రాలిపితే ఎండుతున్న వరి ఆకుకు ఊపిరి పోసినట్లు అవుతుందని పలువురు రైతులు తెలిపారు. వర్షాభావ పరిస్థితులు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.


ఎండుతున్న వరి నారు మడి

ఇంజన్ అద్దెకు తెచ్చుకొని నీరు పెడుతున్నాం

వరి నారు బతికించుకునేందుకు నానాపాట్లు పడుతున్నాం. వర్షాలు పడకపోవడం, ఎండలు మండిపోవడంతో వేసిన వరి నారు ఎండిపోతుంది. ఇంజన్ అద్దెకు తెచ్చుకుని ఇప్పటికే రెండు పర్యాయాలు నారుమడులకు తడులు పెట్టాం. అయినప్పటికీ ఇటీవల ఎండలు విపరీతంగా కాయడంతో నారుమడులు ఎండిపోతున్నాయి. మరోసారి నీరు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. ఆదిలోనే నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. వర్షం కోసం ఎదురు చూస్తున్నాం.



గొర్ల అప్పారావు,
రైతు,
మనబాల వానిపాలెం

బల్క్ డ్రగ్ పార్క్‌పై ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి తహసిల్దార్ కార్యాలయం వద్ద ఈనెల 6వ తేదీన బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కోసం జరవతలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణ వెంటనే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్ డిమాండ్ చేశారు.



పత్రాలు చూపుతున్న నేతలు

స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం సాయంత్రం వారు మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తే పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. అభివృద్ధి పేరుతో ఈ ప్రాంతాన్ని డంపింగ్ యార్డ్‌గా మార్చొద్దన్నారు. ప్రభుత్వం తయారు చేసిన పర్యావరణ ప్రభావిత నివేదిక పూర్తి అవాస్తవాలతో కూడినదని, రాష్ట్రంలో గల పర్యావరణ వేత్తలు, మేధావులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికే అభ్యంతరాలపై రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు, అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు వివరించడం జరిగిందన్నారు. మత్స్యకారుల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకుని ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో దేవర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు


నిరసన చేపడుతున్న గిరిజనులు

పి.కొట్నాబిల్లిలోనే రేషన్ సరుకులు ఇవ్వాలి
- గిరిజనుల వినూత్న నిరసన

ప్రజాశక్తి -రావికమతం: నర్సీపట్నం ఆర్డిఓ జూన్ నెలలో జారీ చేసిన ఆర్డరు ప్రకారం తమకు తమ గ్రామం పాత కొట్నాబిల్లిలోనే రేషన్ సరుకులు అందజేయాలని ఆదివాసి గిరిజనులు కావిడి పట్టుకొని ఆదివారం వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే. గోవిందరావు, గిరిజన సంఘం ప్రతినిధి పాడి బెన్నయ్య, గ్రామస్తులు మాట్లాడుతూ, సుదూర ప్రాంతాల నుంచి రేషన్ సరుకులు తెచ్చుకోలేక పోతున్నామని, తమ గ్రామంలోనే రేషన్ సరుకులు అందజేయాలని డిమాండ్ చేశారు. రేషన్ సరుకులు తెచ్చుకోవాలంటే తాము చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రావికమతం మండలంలోని నాన్ షెడ్యూల్ గ్రామాలైన టీ.అర్జాపురం పంచాయతీ పరిధిలోని పి.కొట్నాబిల్లి గ్రామంలో కొండ దొర తెగకు చెందిన గిరిజనులే జీవనం సాగిస్తున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటింటికి సరుకులు ఇచ్చే రేషన్ వాహనాలను రద్దు చేయడంతో తమకు ఇబ్బందులు మొదలయ్యాయన్నారు. దీంతో గ్రామంలో ఉన్న 70 మంది రేషన్ కార్డు లబ్ధిదారులు రేషన్ సరుకులకు ప్రతినెలా నరకం చూడవలసి వస్తుందన్నారు. డిపోకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాలనుకుంటే రానుపోను సుమారు 16 కిలోమీటర్ల మేర కాలినడకన ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. తాము పడుతున్న ఇబ్బందులపై గత జూన్ నెలలో ఉన్నత స్థాయి అధికారులకు విన్నవించుకోగా స్పందించిన ఆర్డిఓ రామన్న దొరపాలెం డిపో నుంచి పి . కొట్నాబిల్లికి స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసి బియ్యం సరఫరా చేయాలని సూచించారని గిరిజనులు తెలిపారు. నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గదబపాలెం వెళ్లాలన్న కష్టమేనని, తమ గ్రామంలోనే స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజనులు డిమాండ్ చేశారు. తమ గ్రామంలో రేషన్ బియ్యం అందజేయకపోతే మండల రెవెన్యూ కార్యాలయం వద్ద భారీ ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజనులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కండి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు వెంకటేష్

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యా రంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర నాయకులు సిహెచ్.వెంకటేష్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రాము నాయుడు భవనంలో ఎస్ఎఫ్ఐ అనకాపల్లి జిల్లా ప్లీనం సమావేశం ఆదివారం జరిగింది. జిల్లా అధ్యక్షులు ఎం.బాలాజీ, వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం తిరోగమనంలో ఉందన్నారు. విద్యార్థులకు రావలసిన విద్యాదీవెన, వసతి దీవెన నేటికీ రాలేదని తెలిపారు. కాలేజీ యాజమాన్యాలు విద్యార్థుల ఫీజులు కట్టలేదని టిసిలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూడా లేకపోవడం చాలా బాధాకరమన్నారు. వేలాదిమంది విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లేక ఇతర ప్రాంతాలకు వెళ్లవలసి వస్తుందని, లేదంటే ప్రైవేట్ కాలేజీల్ని ఆశ్రయిస్తున్నారని తెలిపారు. హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం పిఫోర్ పేరుతో హాస్టళ్లను దత్తతకు ఇవ్వాలని ఆలోచన చేస్తుందని, ఇది ప్రభుత్వ బాధ్యత నుండి తప్పుకోవడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యను కుంటుపరిచే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. యూనివర్సిటీలో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ తల్లికి వందనం అనేకమందికి రాలేదని చెప్పారు. ప్రభుత్వ విద్యను కార్పొరేట్ విద్యాసంస్థల కట్టబెట్టే ప్రయత్నాలలో భాగంగా నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చినట్లు విమర్శించారు. క్లస్టర్ విధానం పేరుతో స్కూళ్లను వీలైనంతగా దూరం చేస్తున్నారని, దీనివలన పేదలు విద్యకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో విద్యారంగం సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం జిల్లా నాయకులు విజయ్, వెంకటలక్ష్మి, డి దివాకరు, కృపానంద పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు వెంకటేష్

గురుకులాల్లో మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-సబ్బవరం : ఉమ్మడి విశాఖ జిల్లాల్లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎస్సీ కేటగిరీలో మిగిలి ఉన్న సీట్లకు ఆయా పాఠశాలల్లో స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి ఎన్. రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు ఏ గురుకులంలో అయితే ప్రవేశం కోరుచున్నారో ఆ గురుకులంలో సంప్రదించి స్పాట్ అడ్మిషన్ పొందవచ్చునని పేర్కొన్నారు.

కానిస్టేబుల్‌గా ఎంపికైన గిరిజన యువతి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని మారుమూల గిరిజన గ్రామం సమ్మెడకు చెందిన కొరతం కృష్ణవేణి అనే గిరిజన యువతి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైంది. ఈ గ్రామంలో మొదటిసారిగా పోలీస్ ఉద్యోగం సాధించిన గిరిజన యువతిగా కృష్ణవేణి నిలిచింది. తల్లిదండ్రులు దేముడమ్మ, గదుబులు ఇద్దరూ నిరక్షరాస్యులు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే అయినా కృష్ణవేణి పట్టుదలతో డిగ్రీ పూర్తి చేసి, ఉపాధ్యాయ శిక్షణను కూడా పూర్తిచేసింది. ఎస్ఐ ఉద్యోగం సాధించాలని పట్టుదలతో చదివింది. ఈ నేపథ్యంలో ఇటీవల విడుదల కానిస్టేబుల్ ఫలితాల్లో ఎస్టీ కేటగిరిలో 111 మార్కులు సాధించి విశాఖ గ్రామీణ పోలీస్ విభాగంలో కానిస్టేబుల్‌గా ఎంపికైంది. తన బావ కొండలరావు ప్రోత్సాహం ఆమె విజయానికి కీలకంగా నిలిచిందని కృష్ణవేణి పేర్కొంది. తాను భవిష్యత్తులో ఎస్ఐగాని, ఉపాధ్యాయురాలుగా గాని ఉద్యోగం సాధించాలన్నదే తన ఆశయమని చెప్పింది. కృష్ణవేణిని గ్రామస్తులు అభినందించారు. అలాగే మండల కేంద్రం దేవరాపల్లికి చెందిన కొరుపోలు కన్నంనాయుడు, పాశల గౌరునాయుడు ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.


తల్లిదండ్రులతో కృష్ణవేణి